సాక్షి
ఖమ్మం
మంగళవారం । 28 । జనవరి । 2025



విజ్ఞానం పెంచేలా..

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంచేలా చారిత్రక ప్రదేశాల్లో విహార యాత్రలకు తీసుకెళ్తున్నారు. 8లో



.. ఆపేసినట్టేనా?

కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ఏళ్లుగా ప్రోత్సాహక నిధులు విడుదల కాక దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. 8లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం మంచు, చలిగాలుల ప్రభావం ఉంటుంది. ఆ తర్వాత గంట గంటకు ఎండ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రిటైనింగ్ వాల్ పనులు పరిశీలించిన సీఈ

ఖమ్మంఅర్బన్: మున్నేటి ముంపును అరికట్టేందుకు నిర్మిస్తున్న రిటైనింగ్‌వాల్ పనులతో పాటు సాగర్ ప్రధాన కాల్వను జలవనరుల శాఖ ఇన్‌చార్జి సీఈ బి.రమేష్ సోమవారం పరిశీలించారు. ఖమ్మం, రూరల్ మండలాల్లో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన నాణ్యత, భూసేకరణపై సూచనలు చేశారు. ఆతర్వాత సాగర్ ప్రధాన కాల్వ ద్వారా నీటి సరఫరా వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్ఈ వెంకటేశ్వరరావు ఉన్నారు.

వేసవి విద్యుత్ కార్యాచరణపై రేపు సమీక్ష

ఖమ్మంవ్యవసాయం: రానున్న వేసవి సీజన్‌లో నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా ఎన్పీడీసీఎల్ అధికారులు ఇప్పటికే ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా సబ్‌స్టేషన్ల స్థాయి పెంచుతూ అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు అమరుస్తున్నారు. ఈమేరకు సర్కిళ్ల వారీగా సమీక్ష నిర్వహించాలని ఆదేశించిన ప్రభుత్వం నోడల్ అధికారులను నియమించింది. ఖమ్మం సర్కిల్ నోడల్ అధికారిగా నియమితులైన నాగప్రసాద్ ఆధ్వర్యాన బుధవారం వివిధ విభాగాల అధికారులతో సమావేశమై ఇప్పటివరకు పూర్తయిన పనులపై సమీక్షించి, మిగతా పనులపై దిశానిర్దేశం చేయనున్నారు.

గ్రామీణ రోడ్లపై సాఫీగా ప్రయాణం

మరమ్మతులకు రూ.73కోట్లు విడుదల

ఖమ్మంవన్‌టౌన్: గ్రామీణ ప్రాంత రహదారుల రూపురేఖలు మారనున్నాయి. గుంతలమయమైన రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు సుమారు రూ.73 కోట్లు విడుదల చేస్తూ పీఆర్ ముఖ్య కార్యదర్శి డీఎస్.లోకేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

నియోజకవర్గాల వారీగా...

ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో 17.48 కి.మీ. మేర రహదారి(తొమ్మిది పనులు) మరమ్మతులకు రూ.15.38 కోట్లు విడుదల చేశారు. అలాగే, మధిర నియోజకవర్గంలో 10.90 కి.మీ.(నాలుగు పనులు)కు రూ.16.48కోట్లు, పాలేరు నియోజకవర్గంలో 29.04 కి.మీ.(13పనులు) మేర రోడ్ల మరమ్మతుకు రూ.15.17కోట్లు, వైరా నియోజకవర్గంలో 29 కి.మీ. మేర (8పనులు) మరమ్మతులకు రూ.13.67కోట్లు, సత్తుపల్లి నియోజకవర్గంలో 12పనులకు రూ.14.87 కోట్లు విడుదలయ్యాయని పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరెడ్డి తెలిపారు. ఈ నిధులతో అవసరమైన చోట్ల రహదారుల మరమ్మతులు చేపడుతామని ఆయన వెల్లడించారు.

వచ్చేనెల 10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఖమ్మంవైద్యవిభాగం: చిన్నారుల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులి పురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆమె నులిపురుగుల నివారణ, కుష్టు బాధితుల చికిత్సపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వచ్చేనెల 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 19ఏళ్ల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని, తద్వారా రక్తహీనతతో పాటు ఇతర అనారోగ్య సమస్యలను అరికట్టవచ్చని తెలిపారు. జిల్లాలో 3.11లక్షల మంది పిల్లలకు వేసేలా మాత్రలు సిద్ధం చేసుకోవడంతో పాటు పిల్లలందరూ హాజరయ్యేలా విద్యాసంస్థల ప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఫిబ్రవరి 10న మిగిలిపోయిన పిల్లలకు 17న మాత్రలు అందించాలని చెప్పారు. అలాగే, ఈనెల 30న గ్రామాల్లో సభలు ఏర్పాటుచేసిన కుష్టు వ్యాధి గుర్తింపు, చికిత్సపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. డీఎంహెచ్ఓ బి.కళావతి బాయి, ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణ అధికారి డాక్టర్ వెంకట రమణ, డీఈఓ సోమశేఖరశర్మ, డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్కడ ఓకే.. | ఇక్కడ బ్రేక్!



కేఎంసీలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఉద్యోగులు

మున్సిపాలిటీల్లో నాలుగు పథకాల అమలుపై సందిగ్ధత

- గ్రామాల్లో మాత్రం అర్హులకు మంజూరు పత్రాలు
- జీపీ ఎన్నికల నేపథ్యమే కారణమని ప్రచారం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండలానికొక గ్రామాన్ని ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, రేషన్‌కార్డుల మంజూరు పత్రాలను ఆదివారం లబ్ధిదారులకు అందించారు. అయితే, జిల్లాలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ)తో పాటు మూడు మున్సిపాలిటీల్లో ప్రక్రియకు చివరి నిమిషాన బ్రేక్ పడింది. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతుండడంతో ప్రభుత్వం అక్కడ ముందస్తుగా పథకాల అమలు మొదలుపెట్టిందనే చర్చ జరుగుతోంది. దీంతో ఖమ్మం కార్పొరేషన్, సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల్లో అర్హులకు పథకాలు ఎప్పుడు అందుతాయో తెలియక జాబితాల్లో పేర్లు వచ్చిన వారిలో అయోమయం నెలకొంది.

అటు జాబితాలు, ఇటు స్వీకరణ

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో భాగంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పథకాల అమలు కోసం ప్రజాపాలన పేరుతో నిర్వహించిన సభల్లో దరఖాస్తులు స్వీకరించింది. ఇప్పటికే రెండు, మూడు పథకాలు అమలవుతుండగా, తాజాగా రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయి సర్వే చేపట్టడంతో పాటు వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతుభరోసా ఇచ్చేలా పరిశీలించారు. ఆ తర్వాత లబ్ధిదారుల జాబితాతో

ఖమ్మం కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో కొత్తగా అందిన దరఖాస్తులు

మున్సిపాలిటీ	ఇందిరమ్మ ఇళ్లు	రేషన్ కార్డులు	రైతు భరోసా	ఆత్మీయ భరోసా
మధిర	1,423	1,454	-	-
సత్తుపల్లి	2,018	1,571	28	-
వైరా	822	758	217	286
కేఎంసీ	7,627	8,558	-	-
మొత్తం	11,890	12,341	245	286

ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?

గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వం గ్రామాలపైనే దృష్టి సారించిందనే చర్చకు బలం చేకూర్చేలా మధిర, సత్తుపల్లి, వైరా మున్సిపాలిటీలు, ఖమ్మం కార్పొరేషన్‌లో నిర్వహించాల్సిన వార్డు, డివిజన్ సభలు జరగలేదనే ప్రచారం మొదలైంది. ఇదంతా పక్కన పెడితే మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో పథకాల అమలు ఎప్పుడు మొదలవుతుందనే అంశంపై ఎవరూ స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల ముందా, లేకపోతే ఎన్నికలు పూర్తయ్యాకే పథకాలు అమలుచేస్తారా అనేది తేలాల్సి ఉంది. కాగా, ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల్లో అర్హుల జాబితా సిద్ధం కాగా కొత్తగా వేలాది దరఖాస్తులు అందాయి.

21, 22, 23వ తేదీల్లో గ్రామసభలు నిర్వహించారు. అంతేకాక కొత్తగా దరఖాస్తులు స్వీకరించడంతో సభలు సందడిగా సాగాయి.

మండలానికి ఒక గ్రామం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు పథకాలను ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లాలోని 20 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. మూడు చోట్ల సభల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఇక ఖమ్మం కార్పొరేషన్‌లో 26వ డివిజన్‌తో పాటు మూడు మున్సిపాలిటీల్లోనూ ఒక్కో వార్డులో మంజూరు పత్రాల పంపిణీకి అంతా సిద్ధం చేశారు. ఈమేరకు 25వ తేదీన రాత్రి పొద్దుపోయే వరకు కొత్త దరఖాస్తుల ఆధారంగా సర్వే కూడా చేసినా చివరి నిమిషంలో వెనక్కి వెళ్లిపోగా సభలు కూడా రద్దయ్యాయి.

రైతులకు భరోసా



రైతుభరోసా నగదు జమ అయినట్లు రైతుల ఫోన్లకు వచ్చిన మెసేజ్‌లు

- ఎంపిక చేసిన గ్రామాల అన్నదాతల ఖాతాల్లో పెట్టుబడి సాయం
- జిల్లాలో 20,802 మందికి రూ.28.42 కోట్లు జమ
- ఎకరాకు రూ.6 వేల చొప్పున విడుదల
- మిగతా రైతులకు విడతల వారీగా చెల్లింపు

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రప్రభుత్వం ఎట్టకేలకు రైతు భరోసా పథకాన్ని ప్రారంభించింది. మండలానికి ఒక రెవెన్యూ గ్రామాన్ని ఎంపిక చేసి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం రైతులకు మంజూరు పత్రాలు అందజేసిన విషయం విదితమే. ఈమేరకు జిల్లాలో 21 రెవెన్యూ గ్రామాల పరిధిలో 20,802 మంది రైతులకు చెందిన 47,374 ఎకరాల భూమికి పెట్టుబడి సాయం విడుదల చేశారు. ఎకరాకు రూ.6వేల చొప్పున రూ.28.42 కోట్లు వారి ఖాతాల్లో సోమవారం జమ అయ్యాయి. కాగా, మండలానికి ఒక్కో రెవెన్యూ గ్రామాన్ని మాత్రమే పైలట్ ప్రాజెక్టుగా ప్రకటించినా ఆ గ్రామ పరిధిలోని జీపీల్లోని రైతులందరి ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ అయింది. రైతుభరోసా పథకాన్ని మాత్రమే ఇలా అమలుచేయనుండగా, మిగతా మూడు పథకాలు మాత్రం ఎంపిక చేసిన గ్రామాల లబ్ధిదారులకే అందుతాయని తెలిసింది.

ప్రస్తుత సీజన్‌కు మాత్రమే..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తికాగా పంటలకు సంబంధించి వానాకాలం సీజన్ ముగిసి ప్రస్తుతం యాసంగి పంటల కాలం కొనసాగుతోంది. దీంతో రెండు సీజన్లకు కలిపి ఎకరాకు రూ.6వేల చొప్పున రూ.12వేలు జమ చేస్తారని రైతులు భావించారు. కానీ ప్రభుత్వం ప్రస్తుతం సీజన్‌కు రూ.6వేల చొప్పున మాత్రమే జమ చేసింది. గత ప్రభుత్వం 2018 నుంచి ప్రతీ సీజన్‌లో ఎకరాకు రూ.5 వేల చొప్పున చెల్లించగా ప్రస్తుత ప్రభుత్వం ఎకరాకు రూ.వెయ్యి పెంచినా మధ్యలో ఒక సీజన్‌ను విస్మరించడంపై రైతులు పెదవి విరుస్తున్నారు.

మరో 3.25 లక్షల మందికి కూడా...

జిల్లాలో మొత్తం 3,51,592 మంది రైతులకు 7,41,327 ఎకరాల పట్టా భూములు ఉన్నాయి. ఇందులో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాలు పోగా ఇంకా 3.25 లక్షల మంది రైతులకు 'భరోసా' అందాల్సి ఉంది. వీరికి సుమారు 7లక్షల ఎకరాల భూమి ఉండగా ఎకరాకు రూ.6వేల చొప్పున రూ.413 కోట్ల మేర జమ చేయనున్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే తక్కువ భూమి ఉన్న రైతుల నుంచి మొదలు పెట్టుబడి సాయం చెల్లించనున్నట్లు తెలుస్తోంది.

6,419 ఎకరాల తొలగింపు

గత ప్రభుత్వం వ్యవసాయ భూములన్నింటికీ పెట్టుబడి సాయం అందజేసింది. అయితే, సాగు యోగ్యం కాని భూములకు రైతుభరోసా అమలుచేసేది లేదని స్పష్టం చేసిన ప్రస్తుత ప్రభుత్వం అధికారులతో సర్వే చేయించింది. దీంతో ఇప్పటివరకు 5,490 మంది రైతులకు చెందిన 6,419 ఎకరాల భూమి సాగుకు యోగ్యం కాదని గుర్తించారు. ఈ భూములను ఇప్పటికే రైతు భరోసా పోర్టల్ నుంచి తొలగించారు.

సమస్యలు సరిచేస్తున్న అధికారులు

రైతు భరోసా పథకం అమలులో అనేక సమస్యలు వ్యవసాయాధికారుల దృష్టికి వస్తున్నాయి. బ్యాంకు ఖాతాలు, ఆధార్ నంబర్లు వంటి సమస్యలను పోర్టల్‌లో సరిచేస్తూనే కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతుల పేర్లను నమోదు చేస్తున్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు(ఏపీజీవీబీ) తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం కాగా ఐఎఫ్ఎస్‌సీ కోడ్లు మారాయి. కొత్త కోడ్లను రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది.

ఎరుపెక్కిన ఖమ్మం మార్కెట్!



మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

విక్రయానికి 40 వేల బస్తాల మిర్చి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సోమవారం మిర్చి బస్తాలతో ఎరుపెక్కింది. మార్కెట్ కమిటీ గణాంకాల ప్రకారం 40వేలకు పైగా మిర్చి బస్తాలను 1,714మంది రైతులు తీసుకొచ్చారు. ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధికమని చెబుతున్నారు. ఇందులో 37,306 తేజా రకం, తాలు బస్తాలు 2,219, ఏసీ మిర్చి 523 బస్తాలు ఉన్నాయి. ఈనెల 20వ తేదీన 30వేల బస్తాల మిర్చి విక్రయానికి రాగా, ఇప్పుడు అంతకు మించి రావడం విశేషం. ఈనెలారంభం నుంచి మిర్చి విక్రయాలు క్రమక్రమంగా పెరుగుతుండగా సంక్రాంతి తర్వాత మరింతగా ఊపందుకున్నాయి. ఖమ్మం మార్కెట్‌కు ఉమ్మడి జిల్లాతో పాటు మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట, నల్లగొండ పొరుగున ఉన్న ఏపీలోని కృష్ణ, గుంటూరు జిల్లాల రైతులు మిర్చి తీసుకొస్తున్నారు.

ధర వెనుకడుగే...

రోజురోజుకు మిర్చి విక్రయాలు పెరుగుతుండగా విదేశీ ఎగుమతులు మందగించడంతో ధర మాత్రం క్షీణిస్తోంది. గత ఏడాది సీజన్‌లో క్వింటాకు రూ.22వేలకు పైగా పలికిన ధర ఈ ఏడాది సీజన్ ప్రారంభం నాటికి గణనీయంగా పడిపోయింది. ఖమ్మం మార్కెట్‌లో తేజా రకం మిర్చికి సోమవారం గరిష్టంగా రూ.14,800, మోడల్ ధర రూ.13,800గా, ఏసీ మిర్చి ధర రూ.12వేలుగా, మోడల్ ధర రూ.7వేలుగా నమోదైంది. గత వారం తేజా రకం మిర్చి క్వింటాకు రూ.15,300 ధర పలకగా ఇప్పుడు రూ.500 మేర పడిపోవడం గమనార్హం. ఇక తాలు కాయ ధర కూడా గత సీజన్‌లో రూ.13వేలు ఉండగా ప్రస్తుతం రూ.5,700నుంచి రూ.7వేల వరకే పలుకుతోంది. మిర్చి ధర గణనీయంగా తగ్గుతుండడంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆఫ్‌టైప్ మొక్కలకు 'ప్రూనింగ్'?

- రైతులకు అంటగట్టేందుకేనని ఆరోపణలు
- విచారణ జరుగుతున్నా తీరు మారని ఆయిల్‌ఫెడ్
- ఆరా తీస్తే పరిశీలిస్తామంటూ దాటవేత ధోరణి



రేగళ్లపాడు నర్సరీలో ప్రూనింగ్ చేసిన ఆయిల్‌పామ్ మొక్కలు

సత్తుపల్లి: నాలుగు లక్షల ఆయిల్‌పామ్ మొక్కలు ఆఫ్‌టైప్(నాటడానికి పనికిరావని)గా తేలడంతో ఆయిల్‌ఫెడ్‌కు నష్టం రాగా.. పక్కన పెట్టాల్సిన ఆ మొక్కలకు ప్రూనింగ్ చేయడంపై రైతుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. సత్తుపల్లి మండలం రేగళ్లపాడులోని ఆయిల్‌ఫెడ్ నర్సరీలో ఆఫ్‌టైప్ మొక్కలు బయటపడడంతో ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా స్పందించి విచారణ చేపడుతున్నామని వెల్లడించిన విషయం విదితమే. ఆమె ప్రకటన విడుదల చేసి రోజులు గడవకముందే నర్సరీలోని ఆయిల్‌పామ్ మొక్కలకు ప్రూనింగ్ చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. మొక్కలను ప్రూనింగ్ చేసి వాటిని రైతులకు అంటగట్టేందుకు అధికారులు యత్నిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోస్టారికా దేశం నుంచి దిగుమతి చేసుకున్న తంబారకం 3 లక్షల మొక్కలను వివిధ దశల్లో గ్రేడింగ్ అనంతరం ఆఫ్‌టైప్‌గా గుర్తించారు. అయితే, ఈ అంశాన్ని పక్కదోవ పట్టించేలా అధికారులు ప్రూనింగ్ చేపట్టినట్లు ప్రచారం జరుగుతోంది. సహజంగా 6 నుంచి 7 అడుగుల ఎత్తుకు ఎదిగాకే ప్రూనింగ్ చేస్తుంటారు. కానీ, మొక్కలు ఆ స్థాయిలో లేకపోవడమే కాక నాటడానికి పనికి రావని తేల్చినా ప్రూనింగ్ చేయడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.

పరిశీలిస్తాం అంటూనే..

ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా తాజాగా విడుదల చేసిన ప్రకటనలో 80 వేల మొక్కలు ఆఫ్‌టైప్‌గా తేలాక ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ధ్వంసం చేసిన ఘటనపై విచారణ జరుగుతోందని, బాధ్యులకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని తెలిపారు. నివేదిక వచ్చాక ఎవరి తప్పు తేలినా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇంతలోనే అధికారులు ప్రూనింగ్ చేపట్టడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కోస్టారికా దేశం నుంచి దిగుమతి చేసుకున్న 3లక్షల మొక్కల్లో 80 వేల మొక్కలను ధ్వంసం చేయగా, మిగిలిన 2.20 లక్షల మొక్కలకే కాక ఇండోనేషియా దేశం నుంచి దిగుమతి చేసుకున్న యాగంబి రకం లక్ష మొక్కలకు సైతం ప్రూనింగ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాగా, కోస్టారికా దేశం నుంచి దిగుమతి చేసుకున్న మొక్కలు ఆఫ్‌టైప్‌గా తేలాయనే అంశంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంట్రాక్టర్ల నుంచి ప్రతీ పైసా రాబట్టాలని, అవకతవకలు రుజువైతే అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, రైతులకు నాణ్యమైన ఎదిగిన మొక్కలనే పంపిణీ చేయాలని సూచించగా ప్రూనింగ్ అంశం బయటపడడం గమనార్హం.

అవి కావు.. అయినా పరిశీలిస్తాం

ఆఫ్‌టైప్ మొక్కలను ప్రూనింగ్ చేయడం లేదు. సిరాడ్ రకం మొక్కలకు మాత్రమే ప్రూనింగ్ చేస్తున్నాం. అయినప్పటికీ మరోసారి నర్సరీలో పరిశీలించి వివరాలు తెలియజేస్తాం.

– నాగబాబు, ఆయిల్‌ఫెడ్ మేనేజర్

ప్రజలకు పనికొచ్చే ప్రతీ పని చేస్తా...

- అనర్హులకు పథకాలు అందితే వెనక్కి ఇచ్చేయండి
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: ప్రజాప్రతినిధులు, నాయకులు చెప్పేవి, ప్రజలకు పనికొచ్చేవైన పనులన్నీ చేస్తానని.. ఆ పనులను మాత్రం నాణ్యతగా చేయించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం 15వ డివిజన్ అల్లీపురంలో రూ.8.45కోట్లతో నిర్మించనున్న మూడు రోడ్ల నిర్మాణానికి సోమవారం మంత్రి శంకుస్థాపన చేశాక మాట్లాడారు. అర్హులైన పేదలకే పథకాలు చేరాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఎక్కడైనా పొరపాటుగా ధనికులకు పథకాలు అందితే స్వచ్ఛందంగా వెనక్కి ఇవ్వాలని, లేకపోతే గ్రామస్తులే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి తెలిపారు. కాగా, మిర్చి, పత్తి, వరి పంటల సాగుతో వచ్చే లాభం మందులకే సరిపోతున్నందున రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలని సూచించారు. ఇక్కడి వాతావరణం, వాడుతున్న ఎరువుల ఆధారంగా పత్తి, మిర్చి పంటల దిగుబడి తగ్గుతోందని, ఆయిల్‌పామ్‌తో అలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. కాగా, వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధికి చర్యలు చేపట్టామని, విశాలమైన రహదారులు వేస్తున్న చోట ఇబ్బంది కలిగించేలా ఉన్న ర్యాంప్‌లను ఎవరికి వారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. ఈసమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, ఆర్‌డీఓ నర్సింహారావు, విద్యుత్‌శాఖ డీఈ రామారావు, వీ.వీ.పాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు, కార్పొరేటర్లు రావూరి కరుణ, కమర్తపు మురళి, లకావత్ సైదులు, పీఆర్, ఆర్‌అండ్‌బీ అధికారులు వెంకట్‌రెడ్డి, మహేష్, యుగంధరరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావుతో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి, వెనిగళ్ల బాబూరావు, ఎర్రబోయిన గోవింద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల, పక్కన ప్రజాప్రతినిధులు

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత

అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



దరఖాస్తుదారుల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంసహకారనగర్: ప్రజావాణిలో అందే దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరిస్తూ పెండింగ్ లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రజావాణి సందర్భంగా ఆమె ప్రజల నుండి దరఖాస్తులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమై పరిశీలన, పరిష్కారంపై సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో డీఆర్వో ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఏఓ ఎస్.అరుణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన జి.మౌనిక ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, కొణిజెర్ల మండలం అమ్మపాలెంకు చెందిన కుర్రా వీరభద్రం తన భార్య చనిపోయాక ఆమె పేరిట ఉన్న భూమి ఇతరులకు పట్టా చేసినందున మార్చాలని, తల్లాడ మండలం రామానుజవరానికి చెందిన శీలం నరేందర్‌రెడ్డి ఇళ్ల మధ్య ఉన్న సెల్‌టవర్ తొలగించాలని, పువ్వాడనగర్‌కు చెందిన షేక్ సాదిక్‌పాషా డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు.

క్లుప్తంగా

ఎస్సైగా పదోన్నతి, బదిలీ


కృష్ణారావును అభినందిస్తున్న సీపీ, అదనపు డీసీపీ

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి ప్రస్తుతం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న కృష్ణారావుకు పదోన్నతి లభించింది. ఆయనకు ఎస్ఐగా పదోన్నతి లభించగా సీపీ సునీల్‌దత్ సోమవారం అభినందించారు. కాగా, కృష్ణారావుకు పదోన్నతి కల్పించి మహబూబాబాద్ జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

30 మంది విద్యుత్ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ పరిధిలో ఉత్తమ సేవలకు గాను 30 మంది ఉద్యోగులు, కార్మికులకు గుర్తింపు లభించింది. ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాలతో ఖమ్మం సర్కిల్ కార్యాలయం, ఎంఆర్‌టీ, ఖమ్మం టౌన్, రూరల్, వైరా, సత్తుపల్లి విద్యుత్ డివిజన్లలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు మొదలు జూనియర్ లైన్‌మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ కార్మికులు, సిబ్బందిని ఎంపిక చేశారు. వీరికి ఎస్ఈ సురేందర్ ప్రశంసాపత్రాలు అందజేయగా, సహచర ఉద్యోగులు అభినందించారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఖమ్మం సహకారనగర్: విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాకతీయ విశ్వవిద్యాలయం కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం బాధ్యుడు డాక్టర్ పేరెల్లి కోటి డిమాండ్ చేశారు. ఖమ్మంలోని కేయూ పీజీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీల్లో అధ్యాపకుల పోస్టులు భర్తీ చేస్తామని సీఎం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే, ఏళ్లుగా కాంట్రాక్ట్, పార్ట్ టైం, కన్సల్టెంట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారి సేవలపై తగిన నిర్ణయం తీసుకున్నాక పోస్టులు భర్తీ చేయాలని సూచించారు. ప్రస్తుతం అన్ని యూనివర్సిటీల్లో 80 శాతం మంది కాంట్రాక్ట్, ఒప్పంద అధ్యాపకులే విధులు నిర్వర్తిస్తున్నందున అర్హతల ఆధారంగా ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. లేనిపక్షంలో దశలవారీ ఆందోళనలు చేపడతామని కోటి తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎం.శ్యాంబాబు, డాక్టర్ కె.చలపతిరావు, డాక్టర్ రవిబాబు, డాక్టర్ వీరాంజనేయులు, డాక్టర్ జగ్జీవన్‌రావు, పి.మధు, పి.శ్రీనివాస్, జి.రమ పాల్గొన్నారు.

టీ.టీ. పోటీల్లో విజేతలకు బహుమతులు

ఖమ్మం స్పోర్ట్స్: టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. ఈసందర్భంగా విజేతలకు టీ.టీ. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్, వీవీఎస్.మూర్తి బహుమతులు అందజేశారు. వివిధ విభాగాల్లో విజేతలుగా ఆనం ఉజ్వల్, పిట్టల మోహిత్‌కృష్ణ, షేక్ ఫైజల్ అహ్మద్, జ్యులిత్, చార్విక్, యశ్వంత్, ధనుష్, అభిరామ్, సాయివర్షిత్, జె.చరణ్, వీవీఎస్.అఖిల్, గౌరవ్, శ్రీయాన్, రోషన్, గద్దల సిరి, పర్ణవంశిక, సాయిశివాని, సీహెచ్.శరణ్య, జె.హర్షిత, లక్ష్మీహార్విక, ఆరాధ్య, తన్మయిశ్రీ, రక్ష, మేధా సంహిత, తారని రెడ్డి, నిత్య, పాన్య, ఆరాధ్య విజేతలుగా నిలిచారని తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ జంగాల గోపీకృష్ణ, జంగాల స్రవంతి, కారేపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్, సందీప్, బాలసాని మణి పాల్గొన్నారు.

దాడి ఘటనలో అరెస్ట్

ఖమ్మంక్రైం: ఖమ్మంలో ఓ యువకుడిపై ఈనెల 21న కత్తితో దాడిచేసిన ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసినట్లు రిమాండ్ చేసినట్లు వన్ టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. పాత గొడవల నేపథ్యాన పార్సీ బంధంలోని ఇంట్లో నిద్రిస్తున్న కొండపల్లి రాంప్రసాద్‌పై అదే ప్రాంతానికి చెందిన పస్తం కృష్ణ, పస్తం శ్రీకాంత్ కత్తితో దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయనను ఖమ్మం జిల్లా ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం

- ఎక్సైజ్ తనిఖీలకు స్థానికులే కారణమని ఆవేదన?

బోనకల్: మండలంలోని లక్ష్మీపురానికి చెందిన వ్యక్తి సోమవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయన కుటుంబీకులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన నల్లమోతు నాగేశ్వరరావు బెల్ట్‌షాప్ ద్వారా మద్యం విక్రయిస్తున్నాడని కొందరు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఆదివారం తనిఖీ చేసినా మద్యం లభించలేదు. సోమవారం మరోమారు టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేయడంతో మద్యం బాటిళ్లు దొరికాయి. అయితే, కావాలనే కొందరు తనపై కక్షకట్టి అధికారులకు సమాచారం ఇచ్చారని చెబుతూ నాగేశ్వరరావు ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగగా కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో ఐదు బెల్ట్‌షాపులు కొనసాగుతుండగానే ఒకే షాపులో తనిఖీలు చేపట్టడం ఏమిటని వారు ప్రశ్నించారు.

విజ్ఞానం పెంచేలా...

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విజ్ఞాన యాత్రలు
- పీఎం శ్రీలో ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వ నిధులు
- రెండు విడతల్లో భద్రాద్రి జిల్లాకు రూ.49,38,500 మంజూరు
- ఖమ్మం జిల్లాకు రూ.58.16లక్షల నిధులు


వరంగల్‌లోని కాకతీయుల కోట వద్ద విద్యార్థులు (ఫైల్)

పాల్వంచరూరల్: ప్రభుత్వం పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులను విజ్ఞాన యాత్రలకు పంపే అవకాశం కల్పించింది. నిధులు కూడా విడుదల చేయడంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడతోపాటు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్కూల్స్ రైసింగ్ ఇండియా(పీఎం శ్రీ) యోజన పథకాన్ని 2022 ప్రారంభించింది. పలు పాఠశాలలను ఎంపిక చేసి తాగునీటి సౌకర్యం, డిజిటల్ గ్రంథాలయాలు, వృత్తి విద్యా కోర్సులు, ఇంటర్నెట్ కనెక్షన్లు, క్రీడాసామగ్రి, సౌర విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పిస్తోంది. తాజాగా విహార, విజ్ఞాన యాత్రలకు అవకాశం కల్పించింది.

ఉమ్మడి జిల్లాలో 56 పాఠశాలలు

ఉమ్మడి ఖమ్మంలో మొత్తం 3,374 ప్రభుత్వ విద్యాలయాలు ఉన్నాయి. ఇందులో 3,28,366 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా 56 పాఠశాలలను పీఎం శ్రీ పథకానికి ఎంపికయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం విద్యాలయాలు 1,692 ఉండగా, 1,16,189 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీటిలో భద్రాద్రి జిల్లాలో పీఎంశ్రీ కింద మొదటి విడతలో 20 పాఠశాలలు, 7,115 మంది విద్యార్థులను, రెండో విడతలో నాలుగు పాఠశాలలు, 1,223మంది విద్యార్థులను విహారయాత్రకు ఎంపిక చేశారు. కేంద్ర ప్రభుత్వం విజ్ఞానయాత్ర కోసం మొదటి విడతగా రూ.42,22,000, రెండో విడతగా రూ.7,16,500 , మొత్తం రూ.49,38,500మంజూరు చేసింది.

ఖమ్మం జిల్లాలో..

ఇక ఖమ్మం జిల్లాలో మొదటి దశలో 26 పాఠశాలల్లోని 7,689మంది విద్యార్థులు, రెండో విడతలో ఆరు పాఠశాలల్లోని 2,115 మంది విద్యార్థులు విహారయాత్రలకు ఎంపికయ్యారు. మొదటి విడతలో రూ.45,79,500, రెండో విడతలో రూ.12,36,500, మొత్తం రూ.58,16,000 మంజూరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఇవి సందర్శిస్తే ఉపయోగం

విద్యార్థులు విజ్ఞానయాత్రలో భాగంగా రాష్ట్ర రాజధానిలో సైన్స్ మ్యూజియం, వ్యవసాయ యూనివర్సిటీ, అసెంబ్లీ, గోల్కొండ కోట, బిర్లా టెంపుల్, వరంగల్‌లోని కాకతీయుల కాలం నాటి కోట, రామప్ప దేవాలయాలను సందర్శిస్తే విద్యార్థులకు సామాజిక, చారిత్రక విజ్ఞానం పెరుగుతుందని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు. జిల్లాలోని కిన్నెరసాని జలాశయం, ఖమ్మంలోని బౌద్ధస్తూపం, అశ్వారావుపేటలో వ్యవసాయ కళాశాలను కూడా సందర్శించవచ్చు.

విజ్ఞానం పెంచేలా..




విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం విజ్ఞాన యాత్రల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. జిల్లాలో మొదటి, రెండో విడతల్లో 24 పాఠశాలలు పీఎం శ్రీ పథకానికి ఎంపికయ్యారు. పాఠశాలలు మూసివేసేలోపు హెచ్ఎంలు విద్యార్థులను విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్లవచ్చు. యాత్రలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి.

– వెంకటేశ్వరాచారి, డీఈఓ, భద్రాద్రి కొత్తగూడెం

ప్రోత్సహిస్తారా.. ఆపేసినట్టేనా?

- కులాంతర వివాహితులకు అందని ఆర్థికసాయం
- 2020–21 నుండి పెండింగ్‌లోనే..
- జిల్లాలో 319 జంటల ఎదురుచూపులు



ఖమ్మంమయూరిసెంటర్: కుల రహిత సమాజాన్ని నిర్మించి అంతరాలను చెరిపివేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తోంది. కులాంతర వివాహం చేసుకున్న జంటలకు కొన్నేళ్లుగా నగదు ప్రోత్సాహాలు అందిస్తోంది. అయితే, జంటలో ఒకరు ఎస్సీ అయి ఉండాలనేది నిబంధన. కాగా, ప్రస్తుత సమాజంలో పలువురు తల్లిదండ్రులు ఇలాంటి వివాహాలకు అడ్డుచెప్పడం లేదు. తొలినాళ్లలో ఒకే కులమైనా శాఖాబేధాలతో సంబంధాలు కలుపుకునే వారు కాదు. రానురాను అలాంటి పట్టింపులు తగ్గిపోతుండగా శాఖా బేధమే కాకుండా ఇతర కులాల వారూ అభిరుచులు, అభిప్రాయాలు కలిస్తే పెద్దలను ఒప్పించి కులాంతర వివాహాలు చేసుకుంటున్నారు. పెద్దలు ఒప్పుకోకున్నా పోలీసులను ఆశ్రయించి ముందుకు సాగుతున్నారు. ఇదంతా బాగానే ఉన్న కులాంతర వివాహం చేసుకున్న వారిని ప్రోత్సహించేలా ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం ఏళ్లుగా పెండింగ్ ఉండడంతో నిరాశకు లోనవుతున్నారు.

పెంచినా అందలే...

కులాంతర వివాహం చేసుకున్న జంటలను కొన్ని కుటుంబాలు మొదట్లో ఆదరించకపోయినా.. ఆ తర్వాత వారిని కుటుంబాలు దగ్గరకు తీస్తున్నాయి. మరికొన్ని జంటలను మాత్రం దూరంగా పెడుతుండడంతో కుటుంబ పోషణ భారంగా మారే అవకాశముంటుంది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం కులాంతర వివాహం చేసుకున్న జంటలకు నగదు ప్రోత్సాహం అందిస్తోంది. ఈ ప్రోత్సాహం కల్యాణలక్ష్మి కన్నా తక్కువగా ఉండడంతో గత ప్రభుత్వం 2020 ఏడాది జూన్‌లో రూ.50 వేల నుండి రూ.2.50 లక్షలకు పెంచింది. అయితే, నగదు భారీగా పెరిగినా అందకపోవడం గమనార్హం.

ప్రోత్సాహకాలు ఇలా..

వేర్వేరు కులానికి చెందిన స్త్రీ, పురుషులు వివాహం చేసుకుంటే ఆధారాలతో సహా జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకుల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఆధారాలకు అనుగుణంగా అధికారులు విచారణ చేపట్టి ప్రోత్సాహకానికి అర్హులుగా గుర్తిస్తే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారు. ఆపై ప్రభుత్వం జంటలకు ప్రోత్సాహక నిధులు మంజూరవుతాయి.

రూ.7.97 లక్షలు పెండింగ్..

జిల్లాలో 2020–21 ఏడాది నుండి ఇప్పటి వరకు ఐదేళ్ల కాలంలో 500కు పైగా కులాంతర వివాహాలు జరిగినట్లు అంచనా. అయితే, లెక్కలోకి రానివి ఇంకొన్ని ఉంటాయని భావిస్తున్నారు. కాగా, అధికారులకు అందిన దరఖాస్తుల ఆధారంగా 319 జంటలకు ప్రోత్సాహకం మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఇందులో 241 జంటలకు కులాంతర వివాహ ప్రోత్సాహక సాయం మంజూరు చేసినా నగదు మాత్రం విడుదల చేయలేదు. ఇక మరో 78 దరఖాస్తులను ఆమోదించాల్సి ఉంది. దీంతో ఐదేళ్లుగా ఆయా జంటలు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నాయి.

పెండింగ్‌లో ఉన్న సాయం వివరాలు

ఏడాది	దరఖాస్తులు	నగదు
2020–21	42	1,05,00,000
2021–22	99	2,47,50,000
2022–23	86	2,15,00,000
2023–24	88	2,20,00,000
2024–25	04	10,00,000
మొత్తం	319	7,97,50,000

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం..



కులాంతర వివాహం చేసుకున్న జంటలు ప్రభుత్వ సాయం కోసం దరఖాస్తు ఇస్తే స్వీకరిస్తున్నాం. వీటిని పరిశీలించి సాయం మంజూరుపై సమాచారం కూడా చేరవేస్తున్నాం. ప్రభుత్వం నుండి నిధులు రాగానే పెండింగ్‌లో ఉన్న జంటల ఖాతాల్లో జమ చేస్తాం.

– కె.సత్యనారాయణ, ఎస్సీ డీడీ, ఖమ్మం

దరఖాస్తు ఆన్‌లైన్‌కు లంచం డిమాండ్

- ఇల్లు, రేషన్‌కార్డు కోసం మహిళతో బేరం
- ఏసీబీకి చిక్కిన మున్సిపల్ ఉద్యోగి


ఏసీబీకి పట్టుబడిన వార్డు ఆఫీసర్ వినోద్

సత్తుపల్లి: రాష్ట్రప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీకి ఇటీవల గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. ఇందులో భాగంగా దరఖాస్తును ఆన్‌లైన్ చేసేందుకు లంచం డిమాండ్ చేసిన సత్తుపల్లి మున్సిపల్ ఉద్యోగి నగదు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు... సత్తుపల్లి 23వ వార్డుకు చెందిన ఓ మహిళ 18వ వార్డులో ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డు కోసం ఇటీవల దరఖాస్తు చేసుకుంది. దరఖాస్తును ఆన్‌లైన్ చేయించాలని ఈనెల 24న మున్సిపల్ వార్డు ఆఫీసర్ నల్లంటి వినోద్‌ను సంప్రదించగా రూ.3వేలు డిమాండ్ చేశాడు. చివరకు రూ.2,500కు ఒప్పుకోగా బాధితురాలు ఖమ్మంలో ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. దీంతో వారు బాధితురాలితో వినోద్‌కు ఫోన్ చేయించి నగదు విషయమై మాట్లాడుతుండగా వాయిస్ రికార్డ్ చేయించారు. ఆపై సోమవారం ఆమె వినోద్‌కు ఫోన్ చేయగా సత్తుపల్లి పాత సెంటర్‌లోని ఓ జ్యూస్‌షాప్ వద్దకు రమ్మనడంతో అక్కడకు వెళ్లి డబ్బులు ఇస్తుండడంతో అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను మున్సిపాలిటీ కార్యాలయానికి తీసుకొచ్చి విచారణ చేపట్టగా, వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు పనులు చేసేందుకు డబ్బు డిమాండ్ చేస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1064, లేదా 91543 88981(ఖమ్మం ఏసీబీ డీఎస్పీ)కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కాగా, వినోద్ గతంలో సత్తుపల్లి మండలం బేతుపల్లి వీఆర్ఏగా పనిచేయగా, 2023 ఆగస్టు నుంచి మున్సిపాలిటీ వార్డు ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. అయితే, మున్సిపాలిటీలో ప్రత్యేకాధికారుల పాలన మొదలైన రోజే ఉద్యోగి ఏసీబీకి పట్టుబడడంతో తమ పాలకవర్గం పాలన ముగియగానే కాంగ్రెస్ పాలనలో అవినీతి మొదలైందని బీఆర్ఎస్ నాయకులు, తమ పాలన మొదలైనందునే అవినీతి పరుల భరతం పడుతున్నామని పోటీగా కాంగ్రెస్ నాయకులు చేస్తున్న పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

పీఆర్‌టీయూ విజయంతోనే సమస్యల పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: పీఆర్‌టీయూ తరఫున ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పింగిళి శ్రీపాల్ రెడ్డి విజయంతోనే ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయని మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి, సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పి.వెంకట్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాను సంఘం అధ్యక్షుడిగా, ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు ఉపాధ్యాయులకు బదిలీల్లో కౌన్సెలింగ్ విధానం ప్రవేశపెట్టేలా కృషి చేశానని, ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో అప్రెంటిస్ కాలానికి రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇప్పించానని గుర్తు చేశారు. ఈసమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యలమద్ది వెంకటేశ్వర్లు, ఆర్.రంగారావుతో పాటు శేఖర్‌రావు, ఎల్.సతీష్, ఆంజనేయులు, సతీష్, కందుల వెంకట నరసయ్య, సాదు లక్ష్మణరావు, కే.వీ.రమణ, తాళ్లూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్

ఖమ్మంసహకారనగర్: సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు గత నెలలో 28 రోజుల పాటు సమ్మె చేయగా సమస్యల పరిష్కారానికి ఇచ్చిన మేరకు ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు విజయ్, పద్మ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఏ.వీ.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. సమ్మె కాలానికి వేతనం చెల్లించడమే కాక రెగ్యులర్ ఉపాధ్యాయుల మాదిరి సెలవులు వర్తింపచేయాలని, నైట్ డ్యూటీ నుండి మినహాయించాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మనోహర్ రాజు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, వెంగళరావుతో పాటు శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, సంధ్యారాణి, ఉమాదేవి, వెంకటేశ్వర్లు, యాకూబ్ పాషా, గరిక శ్రీనివాస్, రామ్ కోటి పాల్గొన్నారు.

డీఈఓపై ఫిర్యాదు

బదిలీల కౌన్సెలింగ్‌లో నిబంధనలు విస్మరించారని పేర్కొంటూ డీఈఓ సోమశేఖరశర్మపై అదనపు కలెక్టర్ శ్రీజతో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు ఓ ప్రకటనలో తెలిపారు. వారం క్రితం జిల్లాకు 36 మంది స్పౌజ్ ఉపాధ్యాయులు రాగా నియామకపు ఉత్తర్వుల జారీలో తాత్సారం చేస్తున్నారని, గత బదిలీల్లో నిబంధనలకు విరుద్ధంగా 24 మందికి ఎక్కువ హెచ్ఆర్ఏ వచ్చే స్థానాల్లో పోస్టింగ్ ఇచ్చారని ఆరోపించారు. అలాగే, 16 మంది ఉపాధ్యాయులు తమకు ప్రమోషన్ వద్దని లేఖ ఇస్తే రివర్షన్ చేయడంతో పాటు వారికి 17శాతం హెచ్ఆర్ఏ వచ్చే స్థానాల్లో రాత్రికి రాత్రే పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు.

బీఆర్ఎస్ నాయకులపై దాడి గర్హనీయం

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడులో సంక్షేమ పథకాల ప్రారంభానికి ఆదివారం నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు కోడెం రవిపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడం గర్హనీయమని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ అన్నారు. ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవిని సోమవారం మధు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ దాడి చేసిన వారిపై పోలీలసు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు బెల్లం వేణుగోపాల్, మేడ మోహన్‌రావు పాల్గొన్నారు.

శిఖం భూమిలో చేపల చెరువు

తొలగింపునకు సిద్ధమైన అధికారులు, అడ్డుకున్న రైతు


లాలాపురం వాసులతో మాట్లాడుతున్న ఎస్ఐ సూరజ్

కొణిజర్ల: అనుమతి లేకుండా ఓ వ్యక్తి చేపల చెరువు తవ్వడమే కాక చెరువు శిఖం భూమిని కలుపుకున్నాడని ఆరోపిస్తూ స్థానికుల ఫిర్యాదుతో అధికారులు కూల్చడానికి సిద్ధం కాగా యజమాని అడ్డుకోవడం .. స్థానికులు మాత్రం తొలగించాల్సిందేనని పట్టుబట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. వైరా మున్సిపాలిటీ పరిధి కొణిజర్ల మండలం లాలాపురంలో సోమవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని తుమ్మలచెరువు సమీపాన కోటేశ్వరరావు తమ పట్టా పొలమని చెబుతూ చేపల చెరువు తవ్వించగా స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఐబీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి చేపల చెరువు తవ్విన భూమి తుమ్మలచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉందని తేల్చగా గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు సైతం చేపల చెరువును తొలగించాలని ఆదేశించడంతో అధికారులు కొద్దిరోజుల క్రితం చెరువు కట్టలు కూల్చివేసేందుకు రంగంలోకి దిగారు. దీన్ని కోటేశ్వరరావు అడ్డుకోవడంతో కలెక్టర్‌కు దృష్టి తీసుకెళ్లగా ఆయన సైతం తక్షణమే చేపల చెరువు కట్టలు తొలగించాలని సూచించారు. ఈమేరకు సోమవారం ఐబీ ఏఈ నాగేంద్రకుమార్, వైరా ఎఫ్‌డీఓ శివప్రసాద్, తహసీల్దార్ రాము, ఆర్ఐ అశోక్ పొక్లెయినర్‌తో చేరుకుని చేపల చెరువు కట్టల తొలగింపునకు యత్నించగా కోటేశ్వరరావు దంపతులు అడ్డుకున్నారు. చెరువులో చేపపిల్లలు ఉన్నందున కొద్దిరోజులు గడువు ఇవ్వాలని కోరగా ఎఫ్‌డీఓ ఫిర్యాదుతో ఎస్ఐ జి.సూరజ్ చేరుకుని కోటేశ్వరరావు దంపతులను బయటకు పంపించడానికి యత్నించారు. ఇంతలోనే స్థానికులు పెద్ద సంఖ్యలో వచ్చి స్పష్టమైన ఆదేశాలు ఉన్నా చెరువు కట్టలు ఎందుకు తొలగించడం లేదని పల్లిపాడు – గుబ్బగుర్తి రోడ్డుపై రాస్తారోకోకు యత్నించగా కోర్టు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపల చెరువు కట్టలు తొలగిస్తామని నచ్చచెప్పడంతో శాంతించారు. చివరకు అధికారులు చేపల చెరువు కట్టలను తొలగించే పనులు చేపట్టారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడు మృతి


వెంకటేశ్వరరావు (ఫైల్)

వైరారూరల్: కుక్కను తప్పించే క్రమాన ద్విచక్రవాహనం అదుపు తప్ప కాల్వలో పడడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలనుకు చెందిన తోట వెంకటేశ్వరరావు (26) తమ బంధువులైన మట్టా వెంకటేశ్వరరావు, జిడుగు అయ్యప్పతో కలిసి ద్విచక్రవాహనాలపై ఏన్కూరు మండలం సోమలగడ్డకు ఆదివారం రాత్రి వస్తున్నారు. ఈక్రమాన వైరా మండలం గొండ్లపాలెం సమీపంలో మూలమలుపు వద్ద తోట వెంకటేశ్వరరావు ద్విచక్రవాహనానికి కుక్క అడ్డు వచ్చింది. కుక్కను తప్పించే క్రమాన బైక్ అదుపు తప్పి వైరా రిజర్వాయర్ ఎడమ కాల్వలో పడడంతో కాల్వ సైడ్ వాల్వ్ ఆయన తలకు తాకి బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొద్దిసేపటికి వెంకటేశ్వరరావు తమ వెంట రావడం లేదని గుర్తించిన బంధువులు గాలించగా మృతదేహం లభ్యమైంది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకెవరపు వంశీకృష్ణ భాగ్యరాజ్ తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి ...

- కుమారుడికి ఇల్లు రాలేదనే మనస్తాపమే కారణమన్న కుటుంబం


చాట్ల కృష్ణయ్య (ఫైల్)

ఖమ్మంరూరల్: రూరల్ మండలం తెల్దారుపల్లికి చెందిన చాట్ల కృష్ణయ్య(62) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు ఇంటితో పాటు ఎకరం వ్యవసాయ భూమి ఉంది. కృష్ణయ్య ఇద్దరు కుమారుల్లో ఓ కుమారుడు ఖమ్మంలో నివసిస్తుండగా, మరో కుమారుడైన చాట్ల రాము కృష్ణయ్యతో పాటే ఉంటూ ఖమ్మంలో పనిచేసుకుంటున్నాడు. రాము ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా తాజాగా విడుదల చేసిన జాబితాలో పేరు రాలేదు. దీంతోనే కృష్ణయ్య మనస్తాపానికి గురికాగా గుండెపోటు వచ్చిందని కుటుంబీకులు చెబుతున్నారు. ఈమేరకు ఆయన మృతదేహం వద్ద సీపీఎం నాయకుడు తమ్మినేని కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ సిద్దినేని కోటయ్య తదితరులు నివాళులర్పించి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బెల్టుషాప్‌లకు మద్యం తరలిస్తున్న ఆటో అడ్డగింత


మద్యం లోడ్ ఆటోను అడ్డుకోవడంతో వివరాలు సేకరిస్తున్న ఆర్ఐ

కారేపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న బెల్ట్‌షాప్‌లకు వైన్స్ నుంచి మద్యం తరలిస్తుండగా, అక్కడ ధర పెంచి అమ్ముతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనేపథ్యాన సోమవారం మద్యం తరలిస్తున్న ఆటోను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ కారేపల్లిలోని పలు వైన్స్‌ల్లో బెల్ట్ షాప్‌లకు ఎమ్మార్పీపై రూ.20పెంచి విక్రయిస్తుండగా అక్కడ మరో రూ.20 అదనంగా వసూలు చేస్తుండడంతో క్వార్టర్ ధర రూ.40 పెరుగుతోందని పేర్కొన్నారు. అంతేకాక రాత్రింబవళ్లు అమ్మకాలతో బెల్టు షాపుల వద్ద గొడవలు జరుగుతున్నందున ఎక్సైజ్ అధికారులు కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆటోను నిలిపివేసి ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇస్తే వారు తమ పరిధిలోకి రాదని చెప్పడంతో పోలీసులకు సమాచారం తెలపగా వారు తమ పని కాదని దాటవేసినట్లు తెలిసింది. చివరకు పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కారేపల్లి ఎస్ఐ రాజారాం చేరుకుని గ్రామ పెద్దలతో చర్చించారు. మద్యం బాటిళ్లతో ఉన్న ఆటోను కారేపల్లి పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి ఎక్సైజ్ అధికారులు, గ్రామస్తుల సమక్షాన చర్చిస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన సద్దుమణిగింది. తొలుత ఆర్ఐ జార్జి కూడా చేరుకుని వివరాలు సేకరించారు.

నంబర్ ప్లేట్ లేని 25 బైక్‌ల స్వాధీనం

కూసుమంచి: కూసుమంచిలో పోలీసులు సోమవారం రాత్రి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా నంబర్ ప్లేట్ లేని 25ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నంబర్ ప్లేట్ లేకున్నా, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగరాజు హెచ్చరించారు. తనిఖీల్లో ట్రెయినీ ఎస్సై అనిల్‌కుమార్, ఏఎస్సై శైలజ, సిబ్బంది వెంకటేశ్వరరావు, రఫీ, రాము, ఎజాజ్, నాగరాజు, కిశోర్ పాల్గొన్నారు.